

పురసేవల అధ్యయన బృందంలో కమిషనర్ సూర్యతేజ

ప్రజాశక్తి-నెల్లూరు :దేశంలోని ఇతర రాష్ట్రాల్లో సమర్ధవంతంగా నిర్వహిస్తున్న పురపాలక సేవలను అధ్యయనం చేసి రాష్ట్ర ప్రజలకు ఇంకా మెరుగైన సేవలు అందించుటకు గాను నివేదిక అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసిన కమిషనర్ల బందంలో నగర పాలక సంస్థ కమిషనర్ ఎమ్. సూర్యతేజ ఉన్నారు. "బెస్ట్ ప్రాక్టీసెస్ ఆధర్ స్టేట్స్" కార్యక్రమంలో భాగంగా సోమవారం నుంచి జరుగుతున్న ఈ అధ్యయన బందంలో సభ్యునిగా ఆయన తమిళనాడు, కేరళ రాష్ట్రాలలోని ఆదర్శ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలను సందర్శించనున్నారు. ఆయా పట్టణ, పురపాలికలలో తాగునీటి సరఫరా, వ్యర్థాల సేకరణ, రోడ్లు, డ్రైను కాలువలు, భూగర్భ డ్రైనజీ,మరుగుదొడ్లు, ప్లానుల మంజూరు,ఇతర మౌళిక సదుపాయాల నిర్వహణలతో పాటు పన్నుల వసూళ్ళ విధానాలను 5 రోజుల పాటు అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదించనున్నారు.

పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలి..!

- నెల్లూరులో 47 ఏళ్ల తర్వాత రాష్ట్ర మహాసభలు
- సింహపురి ఉద్యమాల పురిటిగడ్డ
- సిపిఎం రాష్ట్ర మహాసభ ఆహ్వాన సంఘం సభలో 'వివిఎస్ఆర్'

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు నగరంలో జరగనున్న సిపిఎం 27వ రాష్ట్ర మహాసభలు పార్టీకి పూర్వవైభవం తీసుకురావడంతోపాటు, ప్రత్యామ్నయ రాజకీయ శక్తిగా ఎదగాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు అన్నారు. 2025 ఫిబ్రవరి 1,2,3 తేదీల్లో నెల్లూరు నగరంలో నిర్వహించనున్న సిపిఎం 27వ రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం ఏర్పాటు మంగళవారం నెల్లూరులోని టౌన్‌హాల్లో జరిగింది. ఈ సమావేశానికి జిల్లా నలుమూలల నుంచి భారీ స్థాయిలో సిపిఎం నేతలు, కార్యకర్తలు, సానుభూతిపరులు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. 1978లో జరిగిన రాష్ట్రమహాసభలు పార్టీకి దిశానిర్దేశం చేశాయని, ప్రత్యేక రాజకీయ పరిస్థితుల్లో జరగనున్న ఈ సభలు చిరకాలం నిలిచిపోవాలని, వివిఎస్ఆర్ పిలుపునిచ్చారు. పొట్టి శ్రీరాములు, పుచ్చలపల్లి సుందరయ్య, జక్కా వెంకయ్య వంటి నేతలు పుట్టిన ఉద్యమాల పురిటిగడ్డ సింహపురిలో ఈ సభలు నిర్వహించడం అభినందనీయమన్నారు.

నెల్లూరులో జరగనున్న రాష్ట్ర మహాసభలు ఎంతో ప్రాధాన్యతవని, పార్టీ క్లిష్టపరిస్థితుల్లో సభలు జరుగుతున్నాయని, సిపిఎంకు దిశా, నిర్ధేశం చేసేలా సాగాలని వి. శ్రీనివాసరావు కోరారు. ఆయన మాట్లాడారు. 1978లో పార్టీ కొత్తగా ఏర్పడిన రోజుల్లో పుచ్చపల్లి సుందరయ్య నాయకత్వంలో ఇక్కడ 47 సంవత్సరాల క్రితం రాష్ట్ర మహాసభలు నిర్వహించారన్నారు. ఆ సభల్లోనూ సుందరయ్య రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారని, రాష్ట్రంలోనూ, జిల్లాలోనూ పార్టీ దశ, దిశలా వ్యాపించిందన్నారు. అనేక రంగాల్లో కృషిచేసిందని గుర్తు చేశారు.

మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్

సింహపురి ఉద్యమాల పురిటిగడ్డ అని, ఇక్కడే భూ పోరాటాలు, కూలీ పోరాటాలు నిర్వహించి అనేక మంది ప్రాణత్యాగాలు చేశారన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలోనూ అనేక మంది నెల్లూరు నుంచి ఉదమ్యంలో పాల్గొన్నా రన్నారు. కూలి పోరాటాల ద్వారా పల్లెలోని ప్రజలను ఐక్యం చేశారన్నారు. నెల్లూరు నగరం ట్రేడ్ యూనియన్ కేంద్రంగా ఎదిగిందని, అనేక మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు భూస్వాములు, మతోన్మాదుల చేతుల్లో మరణించారని తెలిపారు. నెల్లూరులో జరిగిన ఉద్యమాలు రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచాయని పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు, ప్రజా వైద్యులు డాక్టర్ రామచంద్రారెడ్డి, పుచ్చపల్లి సుందరయ్య, జక్కా వెంకయ్య వంటి నేతలు పుట్టిన చోట రాష్ట్ర మహాసభలు నిర్వహించడం సంతోషమన్నారు. రాష్ట్ర ఉద్యమానికి ఈ సభలు ఉత్సాహం, నూతనుత్తేజం ఇవ్వాలని కోరారు. రాష్ట్ర సభలను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని కోరారు.

జాతీయ, అంతర్జాతీయ రాజకీయ అంశాల గురించి ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బిజెపి దుష్ట విధానాలను టిడిపి, జనసేన పార్టీలు అమలు చేస్తున్నాయని విమర్శించారు. దేశంలో మత విద్వేషాలు రెచ్చగొట్టి రాజకీయ లబ్ధిపొందడానికి బిజెపి ప్రయత్నాలు చేస్తుందన్నారు. రూ. 500కోట్లతో అయోధ్యలో రామమందిరం నిర్మాణం చేసి రాజకీయ లబ్ధిపొందడానికి బిజెపి చేసిన ప్రయత్నాలను అక్కడ ప్రజలు తిప్పికొట్టారన్నారు. రాజకీయాలకు దేవుడికి జొడించొద్దని అక్కడ ప్రజలు ఇచ్చిన తీర్పు చెబుతుందన్నారు.జనసేన నేత పవన్ కళ్యాణను ముందుపెట్టి ఇప్పుడు తిరుపతి లడ్డుపై పడ్డారని విమర్శించారు. సనాతన ధర్మం పేరుతో హడావుడి చేస్తున్నారని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.. చంద్రబాబు నాయుడు తరువాత లోకేష్ ముఖ్యమంత్రి అవుతారనే ఉద్దేశంతో రెండేళ్ల తరువాత చంద్రబాబును పక్కన పెట్టి పవన్ కళ్యాణ్‌ను ముఖ్యమంత్రిని చేయాలని ఉద్దేశంతో బిజెపి రాజకీయాలు చేస్తుందన్నారు. బిజెపి అజెండాను పవన్ అమలు చేస్తున్నారన్నారు. అందులో ఆయనను ముందుపెట్టి నాటకాలాడుతున్నారన్నారు. ఏడాది క్రితం తనకు ఏ మతం లేదని, నీ మతం నామతం అంటూ చెప్పిన పవన్ కళ్యాణ్ ఇప్పుడు సనాతన ధర్మం అంటున్నారన్నారు. విప్లవవీరుడు చేగువేరాను పెట్టుకొని తిరిగిన ఆయన మోడీ భజన చేస్తున్నారని సోషల్ మీడియా కోడైకూస్తుం దన్నారు. బిజెపి అజెండాను ఎదుర్కొని, మతోన్మాదాన్ని తిప్పికొట్టాలని పిలుపు నిచ్చారు. గత ప్రభుత్వం మోడీ చేసిన విధానాలు అమలు చేసి భ్రష్టుపట్టి ప్రజల తిరస్కారానికి గురైందన్నారు. ప్రసుత్త చంద్రబాబునాయుడు ప్రభుత్వం అదే విధానాలు అమలు చేస్తుందని ప్రజల నుంచి వ్యతిరేకతను మూటగట్టుకుం టుందన్నారు. తెలుగు దేశం పెట్టిందే కేంద్ర ప్రభుత్వ నిరంకుశానికి వ్యతికేకంగానని , కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేసే తప్పుడు విధానాలకు ప్రత్యామ్నయ విధానాలు అమలుకావాలంటే వామపక్షాలు బలంగా తయారు కావాల్సి ఉందన్నారు. ఉద్యమాల పురిటి గడ్డ నెల్లూరు నగరంలో సిపిఎం రాష్ట్ర మహాసభలు 1978లో 47 సంవత్సరాల క్రితం జరిగాయన్నారు. అప్పుడు పుచ్చలపల్లి సుందరయ్య రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారన్నారు ఇప్పుడు దేశంలోనూ, రాష్ట్రంలోనూ క్లిష్టమైన పరిస్థితుల్లో ఇక్కడ జరగనున్న రాష్ట్ర మహాసభలు ఎంతో కీలకమైనవన్నారు. నూతన ప్రత్యామ్నాయ రాజకీయాలు ఈ సభలు మార్గం చూపాలన్నారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్ మాట్లాడుతూ అమెరికా అంటే శాంతి ఉంటుందని కొందరు అంటున్నారని, అమెరికా అంటే యుద్ధం, అశాంతి, అన్నారు. సైనికులు మధ్య యుద్ధం జరిగాలిగాని అమాయక ప్రజలపై చేస్తున్నారని విమర్శించారు. ఈ సభకు మాదాల వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, పిపిసి సూపరింటెండెంట్ రాజేశ్వరరావు, పార్టీ సీనియర్ నాయకులు చంద్ర రాజగోపాల్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం,మోహన్‌రావు, జొన్నలగడ్డ వెంకమరాజు, గోగుల శ్రీనివాసులు, కె.అజయ్‌కుమార్, తుళ్లూరు గోపాల్, మూలి వెంగయ్య, తిరుపతి జిల్లా కార్యదర్శి నాగరాజు, అన్నపూర్ణమ్మ, మస్తాన్‌బీ, రెహానాబేగం, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు

రాష్ట్ర మహాసభ ఆహ్వాన సంఘం ఏర్పాటు

2025 ఫిబ్రవరి 1,2,3 తేదీల్లో నెల్లూరు నగరంలో నిర్వహించనున్న 27వ రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం మంగళవారం భారీగా ఏర్పాటు చేశారు. గౌర వాధ్యక్షులు మాజీ ఎంఎల్‌సి విటపు బాల సుబ్రమణ్యం, అధ్యక్షులుగా డాక్టర్ మాదాల వెంకటేశ్వరరావు, గౌరవ సలహాదారులుగా పిపిసి సూపరింటెండెంట్ డాక్టర్ బి. రాజేశ్వరరావు, కార్యనిర్వాహక అధ్యక్షులుగా జెఎస్ ట్రస్ ఛైర్మన్ చంద్ర రాజగోపాల్, ప్రధాన కార్యదర్శిగా సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, కోశాధి కారిగా ఎం. మోహన్‌రావు, ఉపాధ్యక్షులు తుళ్లూరు గోపాల్, మూలి వెంగయ్య, మాదాల వెంకటేశ్వర్లు, కార్యద ర్శులుగా కె. అజయ్‌కుమార్, జె. వెంకమరాజు, గోగుల శ్రీనివాసులు, వి.నాగరాజు తోపాటు పాటు మరో 52 మంది సభ్యులతో ఆహ్వాన సంఘం ఏర్పాటు చేశారు.

14 నుంచి పల్లెపండుగ

పంచాయతీరాజ్ వారోత్సవాలు

ప్రజాశక్తి-నెల్లూరు :రాష్ట్రంలో ఈనెల 14వ తేదీ నుంచి 21వ తేదీ వరకు పల్లె పండుగ, పంచాయతీరాజ్ వారోత్సవాలను ఘనంగా నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలనిఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ అధికారులు ఆదేశించారు. మంగళవారం ఆయన అమరావతి సచివాలయం నుండి పల్లె పండుగ పంచాయతీరాజ్ వారోత్సవాల నిర్వహణపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో పల్లె పండుగ పంచాయతీరాజ్ వారోత్సవాలను ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో చేపట్టాలని సూచించారు. పల్లె పండుగ సందర్భంగా రాష్ట్రంలో జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో చెక్ డ్యాములు, వాటర్ షెడ్లు, నీటి కుంటలు, సిమెంట్ రోడ్లు, సిమెంట్ డ్రైన్లు, పంటకాలువలకు సంబంధించిన పనులను చేపట్టాలన్నారు. కాన్ఫరెన్స్ లో పాల్గొన్న కలెక్టర్ఓ.ఆనంద్ మాట్లాడుతూ జిల్లాలో పల్లె పండుగ పంచాయతీరాజ్ వారోత్సవాలను ఈనెల 14 నుండి 21వ తేదీ వరకు నిర్వహించ డానికి చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలో 57.73 కోట్ల రూపాయలతో ఒక వెయ్యితొమ్మిది పనులు చేపట్టడానికి చర్యలు తీసుకున్నామని ఆయన చెప్పారు. జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్ రెడ్డి, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ గంగాభవాని, పంచాయతీరాజ్ ఎస్.ఇ అశోక్ ,జిల్లా గ్రామీణ నీటి



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి-నెల్లూరు

తమిళనాడు పెరంబదూర్ సామ్సంగ్ ప్లాంట్ కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో పొగతోటలో నున్న శాంసంగ్ షోరూమ్ వద్ద ధర్నా నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన ఈ ధర్నా కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి.వి.వి. ప్రసాద్,కె.అజయ్ కుమార్ మాట్లాడుతూ తమిళనాడుశ్రీ పెరంబదూర్ ప్రాంతంలోని సాంసంగ్ పరిశ్రమలో గత నెల రోజుల నుంచి 1500 మంది కార్మికులు ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని కోరుతూ నిరవధిక సమ్మె చేస్తున్నారని తెలిపారు. దక్షిణ కొరియాకు చెందిన బహుళ జాతి సంస్థ సాంసంగ్ భారతదేశంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నప్పుడు, భారత రాజ్యాంగాన్ని గౌరవించాలని, రాజ్యాంగం ప్రకారం కార్మికులు సంఘం పెట్టుకునే హక్కుని గుర్తించాలని, ధరలకనుగుణంగా వేతనాలు పెంచేదాకా ఈ సమ్మెచేసే కార్మికులకు దేశవ్యాప్తంగా మద్దతు తెలియజేస్తామని తెలిపారు. ప్రపంచ సాంసంగ్ వ్యాపారంలో 20శాతం భారతదేశం నుంచే లాభాలను తీసుకుంటూ, భారత కార్మికులను బానిసలుగా చూడడం మానుకోవాలని హెచ్చరించారు. దక్షిణ కొరియాలో పనిచేసే కార్మికులకు 13వేల డాలర్లు చెల్లిస్తూ, భారతదేశ కార్మికుడికి 300 డాలర్లు మాత్రమే చెల్లించడాన్ని తప్పుపట్టారు. తమిళనాడు ప్రభుత్వం పెట్టుబడులను ఆకర్షించాలనే పేరుతో కార్మికుల పోరాటాలను పోలీసులతో నిర్బంధంతో ముగించాలని చూస్తే దేశవ్యాప్తంగా ఉద్యమిస్తామన్నారు. సిఐటియు నగర కార్యదర్శి జి నాగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు రెహానా బేగం, జిల్లా కోశాధికారి కట్ట పెంచల నరసయ్య, కార్యదర్శి అల్లాడి గోపాల్, నాయకులు జానకి రామయ్య, శివ, మధు, విజయ్ పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు

వృద్ధులను ఆదరించండి..!

ప్రజాశక్తి-నెల్లూరు :వద్దులను ఆదరించాలని హెల్పజ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇన్చార్జి లంకపల్లి మృనాల్ అన్నారు. మంగళవారం, కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో కొత్తూరు, నెహ్రూ భారతి వద్ధాశ్రమం ఆమంచర్ల, వానప్రస్థ వద్దుల ఆశ్రమం నందు నిత్యవసరుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేరు వెల్లడిం చడానికి ఇష్టపడని సాఫ్ట్ వేర్ ఉద్యోగిని తన మొదటి జీతంతో నాలుగు ఆశ్రమాలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేయడం అభినందనీ యమ న్నారు. పి.హెచ్.పి జిల్లా గౌర వాధ్యక్షులు అనుముల జయప్రకాష్, విశ్రాంత ఏఎస్ఐ మహబూబ్బాషా, రూడ్స్ చాటబుల్ ట్రస్ట్ చైర్మన్ షేక్ రసూల్, జిల్లా పీ.హెచ్.పీ నాయకులు శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, ఏ బెటర్ లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ షేక్ రిహానా, ఆశ్రమ నిర్వాహకులు ఉన్నారు.

విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

రిపబ్లిక్ పరేడ్ శిబిరానికి

'టిఆర్ఆర్' విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-కందుకూరు :కందుకూరు టిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బికాం మూడో సంవత్సరం చదువుతున్న ఏ.గణేష్ ఎన్ఎస్ఎస్ వాలంటీర్ 'ప్రీ-రిపబ్లిక్ డే పరేడ్' క్యాంపునకు ఎంపిక అయ్యాడు. ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే గణేష్ గత నెల ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగిన వెస్ట్ జోన్ సెలక్షన్స్ లో ప్రతిభ కనబరిచి ఈ క్యాంప్‌నకు ఎంపికయ్యాడు. క్యాంపుకు ఎంపికైన గణేష్ ను ప్రిన్సిపాల్ ఎం.రవి కుమార్, ఎన్.ఎస్.ఎస్ కో-ఆర్డినేటర్లు కోటపాటి నరేష్ రాజా, షేక్ శానాజ్ బేగంలు అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ ఏడుకొండలు నరేంద్ర, ఐక్యుఏసి కోఆర్డినేటర్ పి.రాజగోపాల్ బాబు, అకడమిక్ కోఆర్డినేటర్ శ్రీహరి, గణిత శాస్త్ర అధ్యాపకులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

కరెన్సీ నోట్లతో అలంకరణ

ప్రజాశక్తి-కందుకూరు :కోవూరు రోడ్డులోని శ్రీ దుర్గా భవాని దేవస్థానంలో దేవీ నవరాత్రుల్లో భాగంగా ఆరో రోజు అమ్మవారు శ్రీ మహాలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శన మిచ్చారు. ఆలయ కమిటీ వారు లక్ష్మీదేవి అలంకరణకు రూ. 20,40,000 కొత్త నోట్లతో అమ్మవారి అలంకరణ వైభవంగా చేశారు. కరెన్సీ నోట్లతో శ్రీ దుర్గా మాత దర్శనము ఇవ్వడంతో జనం ఆసక్తిగా చూశారు. ఆలయ అర్చకులు కోవూరు మాధవరావు స్వామి అమ్మవారికి అష్టోత్తరం, కుంకుమ పూజ నిర్వహించారు.

పార్వతీ దేవి అలంకారంలో..

స్థానిక పెద్ద బజారునంద ఉన్న శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆరవరోజు భక్తులకు పార్వతి దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు బాలయ్య స్వామి, రాజా స్వామి అమ్మవారిని పార్వతి దేవి రూపంలో కన్నుల పండుగ అలంకరించారు. అమ్మవారికి ఉదయం అభిషేకం, అష్టోత్తరం, అమ్మవారి మూలమంత్ర హోమం నిర్వహించారు. ఆలయ ప్రెసిడెంట్ కోటవెంకట నరసింహం, ప్రధాన కార్యదర్శి ఇన్నమూరి నరసింహ, ఆలయ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

వక్ఫ్ చట్ట సవరణలకు మద్దతు ఇవ్వొద్దు

కూటమి ప్రభుత్వానికి మాజీ ఎంఎల్ఎ ఎంఎ గఫూర్ సూచన

ప్రజాశక్తి-నెల్లూరు : వక్ఫ్ చట్ట సవరణలకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మద్దతు ఇవొద్దని మాజీ శాసనసభ్యులు, ఆవాజ్ వ్యవస్థాపకులు ఎంఎ గఫూర్ సూచించారు. ఆవాజ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో వక్ఫ్ చట్ట సవరణలు -వాటి పరిణామాలు అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సదస్సు ఆవాజ్ జిల్లా కార్యదర్శి షేక్ రషీద్ అధ్యక్షతవహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంఎ గఫూర్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మైనారిటీలపై అనేక రకాలుగా దాడులు చేస్తుందన్నారు. తినే తిండి మీద దాడి, కట్టు కునే బట్ట మీద దాడి ఇలా ప్రతి విషయంలోనూ దాడి చేస్తుందన్నారు. మైనారిటీ సంక్షేమం కోసం నేడు వక్ఫ్ చట్ట సవరణలు అని చెప్పి మోసగిస్తుందన్నారు. వక్ఫ్ చట్ట సవరణలకు మద్దతుగా రాష్ట్రం నుంచి కూటమి ప్రభుత్వం మద్దతు తెలపడం బాధాకరమన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం వక్ఫ్ చట్టసవరణలకు మద్దతు ఉపసంహ రించుకుంటున్నట్లు ప్రకటించాల న్నారు. లేదంటే మైనారిటీలకు ద్రోహం చేసినట్లవుతుందన్నారు. వక్ఫ్ చట్ట సవరణలకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే ఆవాజ్ పోరాటాలు చేస్తుందన్నారు. వెల్ఫేర్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎంఎ సుభహాన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ ఆస్తులను తమ ఆధీనంలో ఉంచుకునేందుకు, బడా బాబులకు ఇచ్చేందుకు వక్ఫ్ చట్టాలను మార్చాలని అనుకుంటుందని ఇది సమంజసం కాదన్నారు. ఆవాజ్ జిల్లా అధ్యక్షులు సయ్యద్ రఫీ మాట్లాడుతూ జిల్లాలో అనేక సార్లు అన్యాక్రాంతమవుతున్న వక్ఫ్ భూముల కాపాడేందుకు పోరాటాలు చేశామని ఇకపై కూడా వాటిని రక్షించుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ జిల్లా జిల్లా కమిటీ సభ్యులు, లౌకిక ప్రజాతంత్ర వాదులు, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎంఎల్ఎ ఎంఎ గఫూర్

పరిశ్రమల్లో తనిఖీలు చేపట్టాలి

బాల కార్మికులుంటే యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి-నెల్లూరు

జిల్లాలో బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఓ. ఆనంద్ అధికారులు ఆదేశించారు. మంగళవారం బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై జిల్లాస్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన ఆయన ఛాంబర్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పరిశ్రమల్లో, షాపుల్లో పనిచేసే బాల కార్మికులను గుర్తించాలని ఆయన అధికారులకు సూచించారు. జిల్లాలోని పరిశ్రమల్లో ,షాపుల్లో ప్రతి నెల తనిఖీలు నిర్వహించి ఆయా పరిశ్రములు, షాపుల యజమాను లపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, మహిళ శిశు సంక్షేమ శాఖ అధికారులు, బడి మానిన పిల్లల వివరాలను తీసుకొని స్వయంగా తనిఖీలు చేపట్టాలని ఆయన సూచించారు. జిల్లాలో స్వచ్ఛంద సంస్థలు చేపట్టిన సర్వేలో ఉన్న బాల కార్మికుల వివరాలను తనిఖీలు చేపట్టాలన్నారు. జిల్లాసాంఘిక సంక్షేమ అధికారి శ్రీనివాసరావు, జిల్లా విద్యాశాఖ అధికారి పి. రామారావు,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య, కార్మిక శాఖ ఉప కమిషనర్ వెంకటేశ్వరరావు, మహిళ శిశు సంక్షేమ శాఖ డిసిపిఒ సమత, సుమతి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కవిత రెడ్డి, తిరుపతిరావు ఉన్నారు.

పేద రైతులకు అన్యాయం చేస్తే సహించం : వైసిపి

ప్రజాశక్తి-కందుకూరు :కందుకూరు నియోజకవర్గంలో భూమి లేని నిరుపేద రైతులకు 20 ఏళ్ల కిందట, అంతకు ముందు ఇచ్చిన పట్టాలను ఇప్పటి రెవెన్యూ అధికారులు వెరిఫికేషన్ పేరుతో రిజెక్ట్ చేస్తూ ఉన్నతాధికారులకు నివేదికలు పంపిండం దారుణమని వలేటివారిపాలెం వైసిపి నాయకుడు ఇంటూరి హరిబాబు, కందుకూరు మండల నాయకులు, పజాప్రతినిధులు గంగవరపు వెంకట్రావు,ఇంటూరి మాధవరావు, తొట్టెంపూడి శ్రీనివాసులు,కొండికందుకూరు సర్పంచ్ కుమ్మరి బ్రంహయ్య పేరొక్కన్నారు. ఈ మేరకు వారు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పట్టాలు లేకుండా చేసే ఈ తతంగంలో అధికార పార్టీ నాయకుల కుట్ర దాగి ఉందన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో తమకు అనుకూలంగా లేనీ పేద వర్గాలను వేధించడం కోసం పట్టాల వెరిఫికేషన్ ప్రక్రియ చేపట్టారన్నది వాస్తవమన్నారు. రాజకీయ కక్ష సాధింపులో భాగంగా పట్టాల వెరిఫికేషన్ పేరుతో తమకు అనుకూలం కాని నిరుపేద రైతులను ఆర్థికంగా దెబ్బ కొట్టడం కోసం అధికార పార్టీ నాయకులు నడిపిస్తున్న వ్యవహారాన్ని వైసిపి తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. అసైన్మెంట్ పట్టాలు పొంది 20 ఏళ్లకు పైగా భూములను సాగు చేసుకుంటున్న పేద రైతులకు శాశ్వత భూహక్కు కల్పించాలన్న లక్ష్యంతో గత ప్రభుత్వం 596 జిఒ తెచ్చిందని, దాని ప్రకారం నియోజకవర్గంలో అన్ని గ్రామాలలోని రికార్డులను అప్పటి అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి ఫ్రీ హోల్డ్ పట్టాలుగా నిర్ధారించి నోటిపై చేసినట్లు తెలిపారు. కానీ ఇప్పుడు వాటినే రీవెరిఫికేషన్ పేరుతో కనీసం రెండు ఆధారాలైనా చూపించాలంటూ అధికారులు మౌఖిక ఆదేశాలు జారీ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. రాజకీయ ఒత్తిళ్లకు అనుగుణంగా ఫ్రీ హోల్డ్ పట్టాలను రద్దు చేయడానికి అనుకూలంగా రికార్డులను తయారు చేస్తున్నారన్నారు. దీనివల్ల కందుకూరు నియోజకవర్గంలో సుమారు 3 వేల ఎకరాలకు ఫ్రీ హోల్డ్ రైట్స్ పొందిన పేద రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. రాజకీయాలకతీతంగా నిరుపేదలందరూ లబ్ధి పొందాలన్న లక్ష్యంతో గత ప్రభుత్వం 596 జిఒను జారీ చేస్తే.. రాజకీయ కక్షసాధింపుకు దానినే వాడుకోవాలని ఇప్పటి నాయకులు కుట్ర పన్నడం సరికాదన్నారు. వాస్తువాలు పరిశీలించి పేద రైతులకు మేలు జరిగేలా నిర్ణయాలు తీసు కోవాలని కోరుతున్నామని వారు ప్రకటనలో కోరారు.

మాట్లాడుతున్న కలెక్టర్ ఓ ఆనంద్

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

ప్రజాశక్తి-నెల్లూరు

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ఒ. ఆనంద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో రోడ్డు భద్రత కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత రోడ్డు ప్రమాదాల నివారణకు చేపడుతున్న కార్యక్రమాలను డిటిసి చందర్ వివరించారు. రోడ్డు ప్రమాదాలు నివారిం చేందుకు తమ శాఖ ఆధ్వర్యంలో రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమాలను అన్ని కళాశాలలు, హైస్కూల్ లలో చేపడుతున్నట్లు చందర్ చెప్పారు.కలెక్టర్ ఆదేశాల మేరకు తీసుకున్న పలు నిర్ణయాలను అమలు చేయగా, మరికొన్ని పెండిరగ్‌లో ఉన్నట్లు డిటిసి తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను తప్పకుండా అమలు చేసిన తరువాత యాక్షన్ టెకన్ రిపోర్టుతో మీటింగ్‌కు హాజరుకావాలని సంబంధిత అధికారులకు సూచించారు. జాతీయరహదారిపై ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించేలా చర్యలు చేపట్టాలని, హైవే ఎంట్రన్స్, ఎగ్జిట్స్ పాయింట్ల వద్ద ముమ్మరంగా తనిఖీలు చేపట్టి వాహనదారులు హెల్మెట్లు ధరించేలా చూడాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వాహనదారులపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రోడ్లలో అవసరమైనచోట వీధిల్కెట్లు ఏర్పాటు చేయాలని, అన్నిచోట్లా ల్కెట్లు తప్పకుండా పనిచేసేలా చూడాలన్నారు. నగరంలో ప్రైవేటు వాహనాలు నిలుపుదల చేసేందుకు పార్కింగ్ ప్రదేశాలను ఎంపిక చేయాలని సిటీ ప్లానర్‌కు సూచించారు. ఈ సమావేశంలో డిటిసి చందర్, ఆర్‌టివోలు శ్రీచందన, సుధాకర్‌రెడ్డి, నాగలక్ష్మి, డిఎస్పీ శ్రీనివాసరావు, ఎన్‌హెచ్ అధికారులు విద్యాసాగర్, సుడాన్ సు, డిఎంఅండ్‌హెచ్‌వో పెంచలయ్య, ఆర్ అండ్ బి ఎస్ఈ గంగాధర్, డిపివో శ్రీధర్‌రెడ్డి, కమిటీ సభ్యులు కొండా శేఖర్‌రెడ్డి, ఒమ్మిన సతీష్, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎఒ రాము

పలు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'..

ప్రజాశక్తి-కందుకూరు : మండలంలోని పాలూరు, ఆనందపురం గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి వి రాము ఆధ్వర్యంలో ,, పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వి రాము మాట్లాడుతూ వ్యవసాయ శాఖ, అనుబంధ శాఖలన్నింటిని ఒకే చోటికి తీసుకొచ్చి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు వ్యవసాయ విస్తరణ కార్యక్రమం అని తెలిపారు. పలుకూరు, మహాదేవపురం, మోపాడు (పి ఎ సి ఎస్),ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా గ్రామాలలో ఎరువులను జిల్లా మార్క్ ఫెడ్ వారికి సంబధిత సెక్రెటరీ ఏ ఏ ఎరువులు ఎంత పరిమాణంలో కావాలో ఇండెంట్ పెట్టుకొని తద్వారా ఎరువులు తెప్పించుకోవాలని తెలిపారు.కందుకూరు ఉద్యానవన శాఖ అధికారి పి బ్రహ్మ సాయి మాట్లాడుతూ ఉద్యాన శాఖలో వున్న పథకాలు, 50శాతం రాయితీతో యంత్ర పరికరాలు గురించి వివరించారు, అలాగే 90 శాతం రాయితీతో డ్రిప్, 50శాతం రాయితీ తో స్ప్రింక్లర్ రైతులకు అందుబాటులో ఉన్నాయన్నారు. మాచవరం పశు వైద్యాధికారి డాక్టర్ .చెన్నకేశవలు మాట్లాడుతూ గొర్రెలు మేకలు పోషకులకు కేంద్ర ప్రభుత్వ సహకారంతో నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ కింద సుమారు రూ. 4కోట్లు వరకు 50 శాతం రాయితీతో అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారి షేక్ ఖాసిం, రెండు గ్రామాల ,గ్రామ వ్యవసాయ సహాయకులు సి హెచ్ బ్రహ్మయ్య ఉన్నారు.

రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్లను తొలగింపు పనులు చేయుచున్న టిడిపి నేత

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి

ప్రజాశక్తి-బిట్రగుంట

రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టిడిపితోనే సాధ్యమవుతుందని టిడిపి మాజీ మండల అధ్యక్షులు పిన్నిబోయిన సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు. బోగోలు మండలం నాగులవరం గ్రామానికి ఇరువైపుల మొలిచి ఉన్న ముళ్ళ చెట్లను జెసిబి సాయంతో మంగళవారం తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కావలి ఎంఎల్ఎ కావ్య క్రిష్ణారెడ్డి సూచనల మేరకు నాగులవరం పంచాయతీకి మెయిన్ రోడ్డు ఇరువైపుల మొలిచిన పిచ్చిచెట్లను తొలగించినట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో పాలకులు గ్రామాల అభివృద్ధిని పట్టించుకోలేదని తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వం 100 రోజులు పూర్తి చేసుకున్న హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తుందని, ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే వృద్ధులకు, వితంతువులకు రూ.4వేలు, వికలాంగులకు రూ.6వేలు పింఛన్ అందించిన ఏకైక ప్రభుత్వం టిడిపి ప్రభుత్వమని, ఇచ్చిన హామీలలో ఒకటైన ఉచిత గ్యాస్ సిలిండర్లను అందించేందుకు సిద్ధంగా ఉందని, గ్రామ అభివృద్ధికి ప్రజలు, నాయకులు సహకరించాలని, మనం నివసించే ప్రదేశాలు శుభ్రతగా ఉండేటట్లు చూసుకోవాలని తెలిపారు.

నేడు వైసిపి నేతల పర్యటన

ప్రజాశక్తి-అనంతసాగరం : మండలంలోని శంకర నగరంలో బుధవారం జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాకాణి గోవర్దన్ రెడ్డి, ఆత్మకూరు నియోజకవర్గం మాజీ ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి రానున్నట్లు నాయకులు తెలిపారు. మూడు నెలల క్రితం టిడిపి నాయకులు గ్రామ వైసిపి నాయకునిపై దాడి చేసి, ఇల్లు ధ్వంసం చేసిన సంగతి విషయం తెలిసిందే. వైసిపి గ్రామ నాయకులకు ధైర్యం చెప్పేందుకు జిల్లా అధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు గ్రామంలో పర్యటించనున్నారు. మండలంలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు కార్యక్రమంలో పాల్గొనాలని తెలియజేశారు.

పేకాట రాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి-అల్లూరు : మండలంలోని ఉద్దిపురుంట సమీపంలో పేకాట ఆడుతున్న నలుగురిని పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. పేకాట ఆడుతున్నారని విశ్వసనీయ సమాచారం రావడంతో స్థానిక ఎస్ఐ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. దాడిలో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.3590 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు సర్పంచులకు శిక్షణ

ప్రజాశక్తి-విడవలూరు : మండలంలోని 15 పంచాయతీల సర్పంచులు వార్డు మెంబర్లకు పారిశుధ్యం నీటి సమస్యలపై శిక్షణ తరగతులు 9,10 తేదీలలో నిర్వహించడం జరుగుతుందని ఎంపిడిఓ నగేష్ కుమారి తెలిపారు. పంచాయతీలలోని పారిశుధ్యం నీటి సమస్య అభివృద్ధి కార్యక్రమాలపై నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి పంచాయతీ నుంచి ఉపసర్పంచ్ వార్డ్ మెంబర్లు పంచాయతీ సెక్రటరీలు తప్పనిసరిగా రెండు రోజులు నిర్వహించే కార్యక్రమానికి హాజరుకావాలని తెలియజేశారు.

వాతావరణంలో మార్పులు

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : మానవుడు విచ్చలవిడిగా ప్రకృతిని విధ్వంసం చేయడం వల్లే వాతావరణంలో పెను మార్పులు సంభవిస్తున్నాయని ప్రముఖ డాక్టర్ ఎ. పి. జె. అబ్దుల్ కలాం విజ్ఞానగురు పురస్కార గ్రహీత గండికోట సుధీర్ కుమార్ అన్నారు. నెల్లూరు నారాయణ ఇంజినీరింగ్ కాలేజీలో సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం - షార్ ఆధ్వర్యంలో జరుగుతున్న వరల్డ్ స్పేస్ వీక్ - 2024 కార్యక్రమంలో మంగళవారం పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "అంతరిక్షం - వాతావరణంలో మార్పులు" అనే ఇతివృత్తంతో వరల్డ్ స్పేస్ వీక్ - 2024 నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పంటలకు విచ్చలవిడిగా రసాయనాలు ఉపయోగించడం, ప్లాస్టిక్ వాడకం పెరిగిపోవడం, వృక్షాలను నరకడం, సముద్రాలలో వదలడం వల్లే కాలుష్యమయంగా మారి వాతావరణంలో విపరీత మార్పులు సంభవిస్తున్నాయని తెలిపారు.

మాట్లాడుతున్న గండికోట సుధీర్

జొన్నవాడలో శరన్నవరాత్రులు

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా స్థానిక మండలంలోని జొన్నవాడ గ్రామంలో పినాకిని నది తీరాన కొలువుదీరిన శ్రీ మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి ఉత్సవాలలో భాగంగా ఆరవ రోజు మంగళవారం బండారుదర్ల అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ఇఒ ఆర్య భూమి శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు సుగంధ పుష్పాలతో అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆ కరుణామయిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మట్టి తవ్వకాలు జరుపుతున్న ప్రాంతం

విచ్చలవిడిగా మట్టి తరలింపు

ప్రజాశక్తి-విడవలూరు : రామతీర్థం గ్రామంలో పగలు, రాత్రి తేడా లేకుండా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నప్పటికీ ఫలితం శూన్యమని తెలిపారు. ఇటీవల మట్టిని తరలిస్తున్న అధికారులకు వెళ్తున్న ట్రాక్టర్లను గ్రామస్తులు మండలంలోని పట్టించుకోవడంలేదని అసలే చెరువు పెంపు కోసం విద్యార్థులు రోడ్డుపై తిరుగుతూ ఆడుకుంటున్నారు. మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లు అతి వేగంగా వెళుతుండడంతో గ్రామస్తులు ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని తిరుగుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు మట్టి తవ్వకాలను అదుపు చేయాలని కోరుతున్నారు.

రోడ్డుకు అడ్డంగా ఇరువైపులా పెరిగిన చెట్లు

కంపచెట్లతో అవస్థలు

ప్రజాశక్తి-వరికుంటపాడు : విరువూరు నుండి గండిపాలెంకు వెళ్లే రహదారి చిల్లచెట్లతో కమ్ముకుపోయింది. ఈ రోడ్డువెంట మహ్మదాపురం, పాపన్నగారి పల్లె, గొల్లపల్లె, ఎర్రరెడ్డి పల్లె, ఇసుకపల్లె, నల్లబోతుల కాలనీ, గ్రామాలు ఉన్నాయి. రోడ్డుకిరువైపులా దట్టంగా పెరిగిన చెట్ల వలన ఎదురుగా వాహనం వచ్చే కనీసం సైడు ఇచ్చే పరిస్థితి కూడా లేదు. కంపలు గీకొని రక్తపు గాయాలు అవుతున్నాయి. దాంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలో ద్విచక్ర వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపుల ఉన్న చిల్లచెట్లను తొలగించాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ రాజ్ శాఖ డివిజనల్ ఆఫీసర్‌ను వివరణ అడగగా... రోడ్డు పనులు పూర్తయ్యాయని రోడ్డుకు ఇరువైపుల ఉన్న చెట్లను తొలగించాలని నిధులు మంజూరయ్యాయని తెలిపారు. త్వరతగతిన పనులు చేపట్టి వాటిని తొలగిస్తామని తెలిపారు.

పలుచోట్ల 'పొలం పిలుస్తోంది'

మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : మండలంలో గ్రామాల్లో జరిగే పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి పుట్టు సత్యవాణి అన్నారు. మంగళవారం మండలంలోని అరవీడు, మహిమలూరు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి పుట్టు సత్యవాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మండలంలో జరిగే పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ, ఉద్యాన శాఖల ద్వారా అందిస్తున్న పథకాల వివరాలతో ఉపయోగపడుతుందన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయ ఎడిఎ జి.నర్సోజీరావు మాట్లాడుతూ ప్రస్తుత రబీ సీజన్ అనువైన వరి రకాలు, అనువైన కాలం, సాగు యాజమాన్య పరిస్థితులు గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఆత్మకూరు ఎడిఎ వి.దేవసేనమ్మ మాట్లాడుతూ నానో ప్రాముఖ్యత గురించి ప్రకృతి వ్యవసాయం, వరిలో ఎరువుల యాజమాన్యం, ఖర్చులు తగ్గించుకునే విధానాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఉద్యాన శాఖ అధికారి ఆత్మకూరు పి.రాజశేఖర్ శాఖ ద్వారా అందిస్తున్న వివిధ పథకాలు, రాయితీలు గురించి వివరించారు. మండల వ్యవసాయ అధికారి కె.కిషోర్‌బాబు మాట్లాడుతూ వ్యవసాయ శాఖ అందిస్తున్న రాయితీ విత్తనాలు, ఈ-పంట నమోదు, సిసిఆర్ కార్డులు గురించి వివరించారు. కార్యక్రమంలో మహిమలూరు సర్పంచి పి.చంద్రశేఖర్, అరవీడు గ్రామ సర్పంచి ప్రసాద్ రెడ్డి, మహిమలూరు రైతులు వివిఎ, ఎడిఇయస్వంత్, ఎంపిఇఒ, షేక్ నవాజ్, ఎపి సిఎన్ఎఫ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-అనంతసాగరం : మండలంలోని ఆమని చిరువెళ్ల, గౌరవరం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం సర్పంచ్ నలమాకల లక్ష్మమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి పాల్గొని మాట్లాడారు. రబీ సీజన్‌లో అనువైన వరి రకాలు గురించి వివరించారు. ఆత్మకూరు వ్యవసాయ సహాయకులు దేవసేనమ్మ మాట్లాడుతూ ఎక్కువ మోతాదులో నత్రజని ఎరువులు వాడటం వల్ల పురుగులు తెగుళ్లు అధికం అవుతాయని కాబట్టి పంటలకు సిఫారసు చేసిన మేరకే ఎరువులు వాడాలని తెలియజేశారు. మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్ చక్రవర్తి, ఉద్యాన శాఖ అధికారి రాజశేఖర్, గౌరవరం సర్పంచ్ సుబ్బారావు, నర్రా వెంకటరమణ, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఉదయగిరి : 'పొలం పిలుస్తుంది' కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను మండల వ్యవసాయ అధికారి ఆంజనేయులు నాయక్ ఆవిష్కరించారు. మంగళవారం మండల పరిధిలోని కృష్ణంపల్లి శకునాలపల్లి రైతు సేవా కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అనంతరం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు వేసిన వరిపంటలో వచ్చే చెడ పేడల గురించి వారి వివరించారు. వరిలో సస్యరక్షణ చర్యలు యాజమాన్య పద్ధతులను పాటించాలని సూచనలు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని అమలు చేస్తోందని వ్యవసాయ సహాయ సంచాలకులు ఏ. రాజ్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఇస్కపాలెం, చిన్నచెరుకూరు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు జరిగాయి. మండల వ్యవసాయ అధికారి వి వి శిరీష రాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏడీఏ రాజ్ కుమార్ పాల్గొన్నారు. సర్పంచ్‌లు, మత్స్యశాఖ, పశు సంవర్ధక శాఖల అధికారులు, వ్యవసాయ సహాయకులు ఎస్‌డి షర్మిల, శివ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : రబీ సీజన్లో వేసుకోవాల్సిన వరి రకాల మెలకువల గురించి వాటి కాల పరిమితుల గురించి రైతులకు మండల వ్యవసాయ అధికారి ఎం సురేందర్ రెడ్డి వివరించారు. పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా ఇసుకపాలెం, నాగమాంబాపురం గ్రామాలలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. అనంతరం మత్స్యశాఖ అధికారి పొట్టెయ్య మాట్లాడుతూ ఆక్వా కల్చర్ రైతులు చికెన్ వ్యర్థాలను వినియోగిస్తే రానున్న కాలంలో వారి గుంతల లైసెన్సులు రద్దు చేసే అవకాశం ఉందని హెచ్చరించారు. ఫీడ్ మేతలు మాత్రమే ఉపయోగించుకోవాలని కోరారు. లైసెన్సు లేని వారు మత్స్యశాఖ అధికారులను సంప్రదించి తప్పనిసరిగా లైసెన్సులు తీసుకోవాలన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ శ్రీపూజ

జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి-వరికుంటపాడు

పంట నమోదులో అవకతవకలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ సూచించారు. ఆర్ఎడీ చేసి ఉన్న రైతుల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని గువ్వాడి గ్రామ పంట పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. తహశీల్దార్ హేమంత్ కుమార్, ఉదయగిరి మండల వ్యవసాయ అధికారి ఆంజనేయులు నాయక్, విఆర్ఒ ప్రసాద్, వ్యవసాయ సహాయకులు, హరినాథ్, సర్వేయర్ రేణుక, రైతులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-అనంతసాగరం : సోమశిల గ్రామంలోని సోమేశ్వర ఆలయంలో కామాక్షి దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా 6వ రోజున మంగళవారం శ్రీ మహాలక్ష్మి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చినట్టు అర్చకులు రామకృష్ణ శర్మ తెలిపారు. భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించి అమ్మవారి అనుగ్రహానికి పాత్రులయ్యారు.

ఆశా కార్యకర్తలతో సమీక్ష

ప్రజాశక్తి-వరికుంటపాడు

మండల కేంద్రమైన వరికుంటపాడు ప్రజా వైద్యశాలలో మంగళవారం వైద్యాధికారిణి కరిష్మా ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆశా ఆరోగ్య కార్యకర్తలు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. కేటాయించిన లక్ష్యాలను నూరుశాతం సాధించాలన్నారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు సోకకుండా తగు జాగ్రత్తలు వహించాలన్నారు. గర్భిణుల పూర్తి వివరాలను నమోదు చేయాలన్నారు.

వైసిపి నాయకులకు పరామర్శ

ప్రజాశక్తి-బిట్రగుంట

బోగోలు మండలం పాత బిట్రగుంట గ్రామంలో ఉన్న వైసిపి సీనియర్ నాయకులు కర్తం సురేందర్ రెడ్డి తల్లి సంపూర్ణ, కూరపాటి అయ్యప్ప రెడ్డి, పొట్లపల్లి మాల్యాద్రి, కొర్సిపాటి వెంకటేశ్వర్ రెడ్డి, కాకు శీనయ్య కుటుంబాలను మంగళవారం మాజీ ఎంఎల్ఎ కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి వారి నివాసాలకు వెళ్లి వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో పార్టీ నాయకులకు పార్టీ అండదండలు ఎప్పుడూ ఉంటాయని తెలిపారు. ఆయనతో విష్ణువర్ధన్ రెడ్డి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డిఒను కలిసిన మాజీ ఎంఎల్ఎ

ప్రజాశక్తి-కావలి

కావలి నూతన రెవెన్యూ డివిజనల్ అధికారి ఎం.సన్ని వంశీకృష్ణను మంగళ వారం మర్యాద పూర్వకంగా మాజీ ఎంఎల్ఎ, కావలి నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి కలిశారు. అయన వెంట వైసిపి నాయకులు సన్నిబోయిన ప్రసాద్, కుందుర్తి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు

ప్రజాశక్తి-ఉదగయగిరి

రెండు రోజులపాటు జరుగుతున్న ఉప సర్పంచ్ వార్డు మెంబర్ల శిక్షణ తరగతులు మంగళ వారంతో ముగిశాయి. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలోని స్త్రీ శక్తి భవనంలో 17 గ్రామ పంచాయతీల ఉపసర్పంచులకు, వార్డ్ మెంబర్లకు శిక్షణ తరగతులను ఇన్‌ఛార్జ్ ఎంపిడిఒ శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రైనీ అధికారి ఇఒపిఆర్‌డి షేక్ కరిముల్లా మాట్లాడుతూ పంచాయతీరాజ్ చట్టంపై గ్రామ పంచాయతీ పరిపాలనపై అవగాహన కల్పించామన్నారు. గ్రామ పంచాయతీ 15వ ఆర్థిక సంఘం నిధులు ఎలా ఖర్చు చేయాలి, పంచాయతీ అభివృద్ధికి ఆర్థిక నిధులు ఎలా సృష్టించాలి, పారిశుధ్యం, తాగునీరు నిర్వహణ పలు అంశాలపై అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో ట్రైనీ అధికారి ఖాదర్ కరిముల్లా, ఎపిఎం షేక్.ఖాజా రహంతుల్లా, ఉపసర్పంచ్‌లు, వార్డ్ మెంబర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి-అనంతసాగరం

వరల్డ్ స్పేస్ వీక్ సందర్భంగా మండల కేంద్రంలో విద్యార్థులకు నిర్వహించిన పోటీలలో మండలం ప్రథమ స్థానం హన్సిక, ఎం.నందు ద్వితీయ స్థానం సాధించారు. మంగళవారం నెల్లూరులో ఇద్దరు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. బహుమతులు అందుకున్న విద్యార్థులను ఎంఇఒ-2 కాటంరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు బట్రెడ్డి లక్ష్మీప్రసన్న, ఉపాధ్యాయులు మెటుకూరు సుబ్బారెడ్డి, పోలంరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, రత్నారెడ్డి అభినందించారు.

ఆర్‌డిఒకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

ఆర్‌డిఒను కలిసిన ఆర్‌టిసి డిఎం

ప్రజాశక్తి-కావలి

నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆర్‌డిఒ ఎం.సన్నీ వంశీకృష్ణను మంగళవారం ఎపిఎస్ ఆర్‌టిసి కావలి డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా డిఎం శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రూపు వన్ టాపర్ కావలి ఆర్‌డిఒగా డివిజన్ ప్రజల అదృష్టమని, ముఖ్యంగా యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికలు విజయవంతానికి తమ డిపో కార్మికులు రవాణా విషయంలో తమ శక్తి మేర కృషి చేసి, ఓటింగ్ యంత్రాలు, విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను సకాలంలో గమ్యాలకు చేర్చి ఉన్నతాధికారుల ప్రశంసలు పొందారని వివరించారు. ఆర్‌డిఒను కలసిన వారిలో ట్రాఫిక్ సూపరింటెండెంట్ ఎం.రామకృష్ణ, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ డి.రవిప్రకాష్ ఉన్నారు.

సుబ్బరామిరెడ్డి సేవలు ఎనలేనివి..

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

చెర్లో సుబ్బరామిరెడ్డి సిపిఎం పార్టీకి, రైతులకు చేసిన సేవలు ఎనలేనివని, ఆ పార్టీ సీనియర్ నేత చంద్ర రాజగోపాల్ అన్నారు. ఆత్మకూరు పట్టణంలో 7వ తేదీ సోమవారం (నిన్న) ఆయన మృతి చెందారు. 60 సంవత్సరాలుగా సిపిఎంకు విధేయుడుగా ఉండడంతో పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయనను చూసేందుకు తరలివచ్చారు. మంగళవారం అంత్యక్రియల్లో సిపిఎం నాయకులు ఎర్రజెండాను కప్పి ఆయనను సాగనంపారు. ఈ సందర్భంగా మాజీ సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్ర రాజగోపాల్ మాట్లాడుతూ ఆత్మకూరు రైతాంగానికి విశేష సేవలను అందించిన చెర్లో సుబ్బరామిరెడ్డి, చెరువు నీటి సంఘానికి అధ్యక్షులు గానూ ఉపాధ్యక్షులు గానూ, ఆత్మకూరు చెరువు ఆయకట్టు రైతాంగానికే కాకుండా సోమశిల ఉత్తరపు కాలువ ద్వారా ఆత్మకూరు చెరువుకు సాగునీరు అందించేందుకు పార్టీలకు అతీతంగా రైతులను సమీకరించి సాధించారు. సుబ్బరామిరెడ్డి కుటుంబం కమ్యూనిస్టు పార్టీతో ఉన్నారు. డాక్టర్ రమణారెడ్డి, శేషారెడ్డి, దశరథరామి రెడ్డి, కొండారెడ్డి, సుందర రామిరెడ్డిలో మద్రాసులో చదువుకునేటప్పుడు కమ్యూనిస్టు ఐడియాలను ఇచ్చేవారు. డాక్టర్ రమణారెడ్డి, రామచంద్రా రెడ్డి హాస్పిటల్‌లో శేషారెడ్డి తోపాటు రెండో డాక్టర్‌గా రమణారెడ్డి ఆస్పత్రిలో పనిచేసేవారు. అదేవిధంగా రమణారెడ్డి చనిపోయే వరకూ కమ్యూనిస్టు పార్టీలో ఉన్నారు. డాక్టర్ రమణారెడ్డి తమ్ముడిగా సుబ్బరామిరెడ్డి వాళ్ళ అన్న బాటలోనే నడిచారు. ఆత్మకూరులో కమ్యూనిస్టు పార్టీ కార్యాలయానికి మొట్టమొదటిసారిగా రామకృష్ణారెడ్డి, సుబ్బరామిరెడ్డిలో నిర్మాణానికి పునాది వేశారు. అనంతరం సుబ్బరామిరెడ్డి కుటుంబానికి సిపిఎం తరఫున ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య, కౌలు రైతుసంఘం నాయకులు గంటా లక్ష్మీపతి, సిఐటియు జిల్లా నాయకులు జి వి శివ ప్రసాద్, సిపిఎం పట్టణ కార్యదర్శి డేవిడ్ రాజు, సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు, ఆత్మకూరు నాగయ్య, కొండమూరి హజరత్తయ్య, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్ సంధాని, రామకృష్ణారెడ్డి, సిపిఎం నాయకులు ఎం.నాగేంద్ర, ఆళ్ల హజరత్తయ్య, వాగాల శ్రీహరి, కొండాలక్ష్మమ్మ, తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

నివాళులర్పిస్తున్న చంద్ర రాజగోపాల్, నాయకులు

సర్టిఫికెట్లు ఇప్పించండి సారూ..

ప్రజాశక్తి-కావలి

3 సంవత్సరాల నర్సింగ్ కోర్స్ పూర్తి చేసి, పరీక్షలు రాసి, పాసై, 2 నెలలు కావస్తున్నా తమకు సాయి కాలేజ్ ఆఫ్ నర్సింగ్ యాజమాన్యం సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, వాటిని ఇప్పించాలని మంగళవారం విద్యార్థులు కావలి ఆర్.డి.ఒ. వంశీకృష్ణను ఆశ్రయించారు. ఆర్.డి.ఒ. సంబంధిత యజమాన్యంను పిలిపించి మాట్లాడారు. అనంతరం విద్యార్థులు మాట్లాడుతూ కాలేజీ ఫీజులు అమ్మఒడి, వసతి దీవెన నిధులు విద్యార్థులకు కాక యజమాన్యనికే వచ్చేలా చేసుకుని, తమకు శిక్షణ ఇవ్వకపోగా, ఇతర ప్రయివేట్ హాస్పిటల్లో పనిచేయించి, తద్వారా వచ్చే జీతాలను యజమాన్యం స్వాహా చేసిందని విద్యార్థులు ఆరోపించారు.

పరీక్షలు పాస్ అయినా, తమకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, అదేమంటే, ప్రభుత్వం నుండి వసతి దీవెన నిధులు రాలేదంటూ, అవి కావాలంటే రూ.50వేలు కడితే, సర్టిఫికెట్లు ఇస్తామని కరెస్పాండంట్ గోసల దశరథ రామిరెడ్డి అంటున్నారని తెలిపారు. ఆర్.డి.ఒ. మాట్లా డిన తర్వాత కళాశాల యజమాన్యం 20వ తేదీ లోగా సర్టిఫికెట్లు ఇస్తామని చెప్పడంతో విద్యార్థులు శాంతిం చారు. విద్యార్థులకు తోడుగా మహిళా సామాజిక కార్యకర్త చాకలకొండ శారద, యాజమాన్యం వైపు మాజీ కౌన్సిలర్ సురే మదన్‌మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

ఆర్‌డిఒకు సమస్యను వివరిస్తున్న విద్యార్థులు

ఏరియా ఆస్పత్రిలో శస్త్రచికిత్స

ప్రజాశక్తి-కావలి

కావలి ఏరియా ఆసుపత్రిలో గైనకాలజీ విభాగం ఆధ్వర్యంలో సోమవారం అన్నగారిపాలెం గ్రామానికి చెందిన శైలజ అనే మహిళకు అతి కష్టమైన శస్త్ర చికిత్స చేసి, డెలివరీ చేసి, గర్భాశయంలో ఉన్న అతి ప్రమాదకరమైన 25ఇ15 సెంటీ మీటర్ల ఓవరియన్ సిస్ట్ (గడ్డ)ను తొలగించారు. నిరుపేదలైన పేషెంట్ బయట ప్రయివేట్ హాస్పిటల్‌లో అయితే దాదాపు రూ.80వేలు ఫీజు కట్టాల్సి వచ్చేది. కాగా పేషెంట్ హైదరాబాద్‌లో పరీక్షలు చేయించుకుంటూ 8 నెలలు నిండిన తర్వాత కావలి ఏరియా హాస్పిటల్‌లో చికిత్స కోసం చేరింది. 9 వనెలలో డెలివరీ నొప్పులు రాగా గైనకాలజీ విభాగం డాక్టర్లు వెంకటలక్ష్మి, మాధవిలత, నర్సింగ్ విభాగం లక్ష్మి ప్రసూనలు అత్యంత చాకచక్యంతో ఈ శస్త్ర చికిత్స చేసి, తల్లి, బిడ్డల ప్రాణాలు కాపాడారు. ఈ సందర్భంగా వారు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఈ విషయాలు తెలిపారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ పద్మావతి, ఆర్.ఎం.ఒ. ప్రమీల డాక్టర్లను అభినందించారు. వారు మాట్లాడుతూ గైనకాలజీ డాక్టర్లు వారి నెలవారి టార్గెట్ 100 డెలివరీలు దాటారని, వారిని ప్రజలు ప్రోత్సహిస్తే అద్భుతాలు చేయగలరని తెలిపారు. సమావేశంలో హాస్పిటల్ సలహా సంఘం కమిటీ సభ్యులు నాగలక్ష్మి, చవల రామకృష్ణ, పొబ్బా సాయి విఠల్, ఏటూరి శివ, తదితరులు పాల్గొన్నారు.



శస్త్రచికిత్స విజయానందంలో వైద్యులు

మాజీ ఎంఎల్ఎ రామిరెడ్డి పరామర్శ

ప్రజాశక్తి-కావలి

స్థానిక 33వ వార్డు వైసిపి నాయకులు బొగ్గవరపు వెంకటేశ్వర్లు (బీవీ) ఇటీవల అనారోగ్యం కారణంగా హాస్పిటల్‌లో చికిత్స పొంది కావలిలోని వారి నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయనను మాజీ ఎం.ఎల్.ఎ. రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి పరామర్శించారు. అయనవెంట పట్టణ వైసిపి నాయకులు కనమర్లపూడి వెంకటనారాయణ, కుందుర్తి శ్రీనివాసులు, నాగేశ్వరమ్మ, గుర్రం వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

నూతన దంపతులకు ఆశీర్వాదం

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని పొంగూరు సర్పంచ్ ఉర్లగంటి శ్రీనివాసుల రెడ్డి కుమార్తెకు ఇటీవల వివాహం జరుగగా ఆ దంపతులను ఆత్మకూరు మాజీ ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆశీర్వదించారు. మంగళవారం పొంగూరు గ్రామంలోని శ్రీనివాసులరెడ్డి నివాసానికి వెళ్లి నూతన వధూవరులు వెంకటసుప్రజ, ఉమామహేశ్వర రెడ్డిలను ఆశీర్వదించారు. ఆయనవెంట వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

Notice
IN THE COURT OF THE IV ADDL.CIVIL JUDGE (SENIOR DIVISION):: GUNTUR
I.A.No.2/2024 in O.S.No.100/2023

Between:
Kothapalli Geetha - Petitioner / Plaintiff
And
Ravisetty Venkateswaramma (Died) & Others - Respondents / Defendents

To,
R-3: **Kothapalli Bharathi,** W/o **Srinivas,**
R-4: **Boddukuri Siva Sankar,**
S/o Late **Venkata Seshaiah,** Both are R/o.Door No. 3-1-218, Nawab Pet, Nellore City, SPSR Nellore Dt. (Proposed Defendents 3&4)

పై నెంబరు దావాలోని ఐ.ఎ. నెం:2/2024లో 3 & 4వ రెస్పాండెంట్లు అయిన మీకు పై కోర్టు నుండి వారి నుండి నోటీసులు పంపించినను మీరు తీసుకొనక కాల యాపన చేయుచున్నందున మీకు నోటీసును ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని **తేది: 28-10-2024** కి వాయిదా వేసియున్నారు. కావున ఆ రోజున **ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గానీ లేక మీ వకీలు గారి ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలను తెలుపుకోగలరు. లేనిచో శ్రీ కోర్టు వారిచే చట్ట ప్రకారం తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా తేది: **28-10-2024**

యస్.యస్.మొహమ్మద్,
యమ్.ప్రసాద్,
పటీషనర్/ వాది తరపు న్యాయవాదులు, గుంటూరు,
సెల్: **94936 42338**

ఐక్యంగా పోరాటాలు చేయాలి

ప్రజాశక్తి-కొడవలూరు

హక్కుల సాధన కోసం ప్రతి కార్మికుడు ఐక్యంగా ఉండి పోరాటాలు చేస్తే హక్కులు సాధించుకోగలమని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గోనె దయాకర్ అన్నారు. ఆయన మంగళవారం నార్త్ రాజుపాలెం లోని ఎఫ్ సిఐ గోదాంలో జరిగిన ఆటో కార్మికుల మండల జనరల్ బాడీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను చట్టాల రూపంతో కాలురాస్తుందన్నారు. పెట్రోల్ డీజిల్ నిత్యావసర వస్తువుల ధరలు, కూరగాయల ధరలు పెరుగుతుంటే వాటిని ప్రభుత్వాలు నియంత్రించకుండా ఆటో కార్మికులపై చట్టాల ద్వారా అధిక భారం మోపుతుందన్నారు. ఈసందర్భంగా ఆటో ట్రాన్స్‌ఫోర్టు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మారుబోయిన రాజా, కె సురేష్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ట్రాన్స్‌పోర్టు రంగంలో కార్మికులు కఠినమైన చట్టాల ద్వారా ఆర్థికపరమైనటువంటి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. అంతేకాకుండా ఈ మధ్యకాలంలో కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ట్రాన్స్‌పోర్టు రంగాన్ని నిర్వీర్యం చేసే విధంగా హిట్ అండ్ రన్ సత్యాన్ని తీసుకువచ్చి లక్షలాది రూపాయల జరిమానాలు జీవిత ఖైదీ లాంటి జైలు శిక్షలు విధించే విధంగా చట్టాన్ని తెచ్చిందన్నారు. ట్రాన్స్‌పోర్టు రంగాన్ని నిర్వీర్యం చేసే దానికి కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అనుసరించే కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ కార్మిక వర్గం భవిష్యత్తులో పోరాటాలు చేయాలన్నారు.కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి తలారి నరసింహులు, ఆటో కార్మిక సంఘం నగర కార్యదర్శి పి మురళి, జిల్లా కమిటీ సభ్యులు హరిబాబు, ఆటో కార్మికుల సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక:

ఆటో ట్రాన్స్‌పోర్టు కమిటీ అధ్యక్ష కార్యదర్శులు ఏ .వెంకయ్య ఎస్. సురేష్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గోనె దయాకర్

పోగొట్టుకున్న నెక్లెస్ బాధితురాలికి అందజేత

ప్రజాశక్తి-నెల్లూరు

నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఇరుకళల పరమేశ్వరి దేవస్థానానికి దైవ దర్శన నిమిత్తం విచ్చేసిన మూలాపేట ప్రాంతానికి చెందిన ఓ మహిళ చిన్నబజారు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలు చేసిన ఫిర్యాదు పట్ల స్పందించిన చిన్నబజారు పోలీసులు వెంటనే క్రైమ్ పార్టీ సిబ్బంది సాంకేతికత ఆధారంగా శోధించి, ముద్దాయిని గుర్తించి, చాకచక్యంగా పట్టణంలో అతని ఆచూకీ కనుగొని నెక్లెస్ ను రికవరీ చేశారు. నెక్లెస్ పోయినట్లు ఫిర్యాదు చేసిన బాధితురాలిని మంగళవారం పోలీసు స్టేషన్‌కు పిలిపించిన అధికారులు ఆభరణాన్ని అందజేయడంతో ఆమె కన్నీటి పర్యంతమైంది.ఈ సందర్భంగా క్రైమ్ పార్టీ సిబ్బంది సేవలను అభినందిస్తూ, ఈ శరన్నవరాత్రుల బందోబస్త్ నిర్వహిస్తున్న క్రైమ్ టీమ్ లు, బందోబస్త్ సిబ్బంది మరింత అప్రమత్తంతో విధులు నిర్వహించాలని ఎస్‌పి ఆదేశించారు.ఈ సందర్భంగా భక్తులు, ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.